
# పొగలు

'ఇందూ రమణ'



అయోమయంగా అడుగులేస్తూ కొత్త రోడ్డు చేరుకున్నాను.

ఆసీలు మెట్టనుండీ కొత్తరోడ్డు జంక్షన్ వరకూ ఆలోచిస్తూ నడుచుకొచ్చానుగానీ, ఈ గంటన్నర నడకలోనూ నాకు తెలిసిన మొహం ఒకటీ తారసపడలేదు.

నా దురదృష్టమేమోగాని కనీసం పూరివా ళ్ళెక్కరూ కనిపించలేదా గంటన్నర కాలంలోనూ.

అటూ — ఇటూ ఇరువైపులా పరికిస్తూ సూపర్ 'టీ' స్టాల్ముందు నిలబడ్డాను

మొట్టమొదటిసారిగా నేనీ దరిద్రావస్థకు దెబ్బతిన్నది — దొరికిపోయినది — ఈ క్షణమే!

ఏ రోజూ నేనూ జేబులో ఇరవయ్యో — ముప్పయ్యో రూపాయినోట్లు లేకుండా వైజాగ్ రాలేదు. ఇవాళ నా కర్మకాలి పది రూపాయల్తో పట్నం రావడమేమిటి? వచ్చాను. వచ్చాక వచ్చిన పని సవ్యంగా చేసుకుపోక సినిమాహాలుకు ఎందుకు వెళ్ళాలి? వెళ్ళాను. వెళ్ళినట్టూ సినిమా అవస్థలు పడుతుంటే తానెందుకు తిరిగి వచ్చెయ్యలేదు.

రాలేదు... రాలేదు... రాలేదు. సినిమా బావుందని విని వూరుకోలేక ఉసూరుమంటూ ఓ అరగంట నిలబడి ఏ మహానుభావుడైనా స్పేర్ టకెట్ ఆఫర్ చేస్తాడేమో ఎదురు చూడక — చూడకుండా — స్టైల్గా బ్లాక్లో ఎందుకు బేరమాడాలా? ఆడాను. బేరమాడేనే అనుకో! రెండు రూపాయల టిక్కెట్టూ రెండు పదులకీ చేరేసరికి బుద్ధిగా హాలునుండి బయటపడక జేబులో భద్రంగా దాచిన పది రూపాయలనోటునీ అక్కడ — ఆ బ్లాక్ మార్కెటీర్లందరి ముందూ ఎందుకు ప్రదర్శించవలె!

ఆ పది రూపాయల ప్రదర్శనేకదా నాకీ ప్రారబ్ధాన్ని తెచ్చిపెట్టింది.

అంతవరకూ బాగా గుర్తు ఆ తర్వాత .. తర్వాత సంగమ్ థియేటర్ దాటి ఆర్టీసీకాంప్లెక్స్ దగ్గరకొచ్చి బస్సెక్కుతూ జేబులు తడుము కుంటే ఇంకేముంది? కాళీజేబు ఎంత కెలికినా ప్రయోజనమేముంది?

పద్మవ్యూహంలాంటి పదిమంది బ్లాక్వాళ్ళ మధ్యా రూపాయి కాగితం తీస్తే భద్రంగా అది బైటపడుతుందా?

నాకా క్షణం ఏడుపొచ్చినంత పనైంది.

నిక్షేపంలాంటి పది రూపాయలూ పరుల పాలు అయిపోయాయి. కనీసం పది పైసలు పెట్టి పకోడీ ముక్కలు కొనుక్కోవడానికి మనసొప్పక — పది రూపాయలూ ఇంటికెళ్ళే వరకూ సరిపోతుందో — లేదోనన్న భయంలో కడుపు కాల్చుకొని — కోరిక చంపుకొని — తీరా పారేసుకున్నాడు. కాదు... కాదు... పోరంబోకుల పాలిట పడేసాడు.

సీతమ్మదార నుండి సీమటపాకీల్లాంటి కాలేజీ అమ్మాయిల్ని మోసుకొచ్చి ముందరాగింది మా రూటు బస్సు.

నా కుర్ర వయసు ఉసూరుమంటూ మూలిగింది.

గుంటలు... గున్నమామిలా ఉన్న రవ్వజైన రామచిలుకలు. కిలకిలా నవ్వుతూ — కేరింతలు కొడుతున్నారు. ఆ అమ్మాయిలందరిముందూ ఇద్దరు ముగ్గురు అబ్బాయిలు మునలమ్మల్లా నిలబడి ఉన్నారు.

ఆ అమ్మాయిల ప్రేలాపన పెట్రేగి పోతోంది.

బస్సు ఇంజను శబ్దంలా ఉండుండీ విర్రవీగి పోతున్నారా కాలేజీ కన్యలు.

తదేకంగా వాళ్ళవైపు చూడలేక తలదించు కున్నాను.

నాలోని కుర్రవయసు కుర్రో — మొర్రో అంటూ కూనిరాగం తీస్తోంది

పరిస్థితి ఫిఫ్టీ ఫిఫ్టీ పట్టుకు నిలబడింది.

సిస్ండ్రీ దట్టించినట్టూ ప్రయాణీకుల్ని బస్సులో సర్ది రైట్ చెప్పాడు కండక్టరు.

నిప్పంటిన తారాజువ్వలా నా ముందు నుండి దూసుకు పోయింది ఇరవయ్యో నెంబరు సిటీబస్సు.

చేతులు రెండూ జేబుల్లో పెట్టుకుని మళ్ళా చుట్టూ పరికించిచూసాను.

నా కళ్ళు జిగేలుమన్నాయి.

రామలక్ష్మి !

రామలక్ష్మి !

మా వూరి ముద్ద మందారం. కుర్రకారు కళ్ళల్లోని ఆశాజ్యోతి.

బుట్ట బొమ్మలా అలంకరించుకొని — సింగారా లద్దుకొని వయ్యారంగా నడుస్తూ వస్తోంది. నా వైపే... నావైపే... క్షణం తొట్రుపడ్డాను. మరుక్షణం సర్దుకొని దర్జాగా నిలబడ్డాను.

తిన్నగా నా ముందుకొచ్చి నిలబడింది. తల దించుకొని బస్సుకోసం ఎదురు చూస్తోంది.

ఆమె తన వ్యానిటీబ్యాగ్ తెరిచి లోపలనున్న రూపాయినోట్లు సరిచూసుకొని రెండ్రూపాయల కాయితం తీసి రుమాల్లో పెట్టి చుట్టి పట్టుకు నిలబడింది.

బహుశా బస్సు చార్జీకోసం తీసి పట్టు కొనుంటుంది.

బస్సు చార్జీ... చార్జీ... చాచి లెంపకాయ తగిలినట్టయింది. ఉలిక్కిపడి ఆమె మైకంనుండి తేరు కున్నాను.

రూపాయి... రూపాయి... రూపాయి... కనీసం ఒక్కరూపాయి ఏ ఒక్కరైనా దానం చేస్తే బావున్ను. ఎవరైనా 'ఇందా'అని అందంగా అందిస్తే బావున్ను!

అడగంది అమ్మైనా అన్నం పెట్టదు. నోరు తెరచి తన దీనావస్థ మొరపెట్టుకోకుండా ఎవరు పిలిచి ఇస్తారు ?

ఛీ!... ఛీ! ఎవర్నడిగేస్తాం. ముక్కూ—మొహం తెలియని ప్రతీ వాణ్ణీ చెయ్యచాచి అడిగెయ్యడమే ! వెధవది రూపాయికోసం కాణీకి టెకానాలేని ప్రతీ దద్దమ్మని అడిగేయటమే !

నా ఆలోచనలకి నేనే తిట్టుకున్నాను. నా బట్టలవైపు హుందాగా ఓసారి చూసు కున్నాను.

కొరియా పోలిస్టరు పేంటుమీద ఇండియా గ్వాలియర్ షర్టువేసి క్రింద కాళ్ళకి పాయింట్‌షూ నిగ... నిగ లాడుతోంటే కళ్ళని అంటి పెట్టు కున్న కళ్ళద్దాలు నాజూగ్గా చేత్తో సర్దుకొని నిలబడా ను.

జేబులో చిల్లిగవ్వలేక వూరివాడెవడైనా కనిపిస్తే కనీసం బస్సు ఛార్జీల కోసం ఓ రెండు రూపాయలు అప్పడుగుదామనుకొని ఆరుగంటల నుండీ ఇక్కడ కాచుక్కూర్చున్నాడు తను.

ఒక్కడంటే ఒక్కడూ కనిపించలేదు.

ఇప్పుడు — !

నా కాళ్ళు కట్టేసినట్టూ ముందుకు కదల నంటున్నాయి.

ఇన్నాళ్ళూ ఆమె ముందు హీరోలా ఉర్లో పోజులిచ్చుకు తిరిగి ఇప్పుడు — ఛీ! ... ఛీ! ... ఆమెనా ఓ రెండు రూపాయలు దానం చేయమని దేవుల్లాడాలి ! నో ! ... నెవ్వర్ !

ఆమె కూడా తన అందానికి ముగ్ధురాలై ఆశగా చూస్తోన్న తరుణంలో — ఆమె తన హృదయ సామ్రాజ్యానికి విహారానికి విచ్చేయా లనుకుంటున్న తరుణంలో —

తను ... తను .. ఓ బికారిలా — దిక్కు మాలినవాడిలా — దరిద్రగొట్టు దద్దమ్మలా — హీనంగా — దీనంగా ఆఫ్టరాల్ ఓ రెండు రూపాయల కోసం తన హీరోయిజాన్ని హీనపరచుకోవాలా ?

ఆమెకాక ఇంకెవరైనా కనిపిస్తారేమోనని చుట్టూ పరికించాను. ఇంతలో ఆమె నా వైపే చూస్తోంది. ఆశ్చర్యపోయింది. కళ్ళింతచేసుకొని చూసింది.

నేనూ ఆమెవైపు అప్పుడే చూసిన వాడిలా చూసాను.

తెలిసిన మొహం — వూర్లో పదే — పదే తనకు తారసపడే మొహం పైవూర్లో కనిపించే సరికి ఎవరైనా — ఎవరికైనా ఆ క్షణం ఆ మొహాన్ని పరామర్శించాలనిపిస్తుంది.

ఆ అమ్మాయి కూడా అదే ఉద్దేశ్యంతో నా వైపు చూస్తోన్నట్టనిపించింది.

చిన్నగా నవ్వి పలకరించాను.

మొట్టమొదటిసారి ఆమెతో మాట్లాడటం నాకెందుకో ఏనుగెక్కినంత సంబరంగా ఉంది.

ఆమె కూడా నవ్వుతూ పలకరించింది.

ఆమె పలకరించటమే తడవుగా ఆమె దగ్గరకు వెళ్ళి నిలబడ్డాను.

''ఎక్కడినుండి వస్తున్నారు'' ఏదో మాట కలపాలని అన్నాను.

''సంగమ్ థియేటర్లో సినిమా చూసుకొని ఇలా షాపింగ్‌కని వచ్చాను. మీరూ ?!'' కమలా పండు తొనలా తియ్యగా ఉన్నాయామె పలుకులు.

''నేను ... నేను ...ఇక్కడ మా ఫ్రెండొక డున్నాడు. వాణ్ని కలవాలని ఇప్పుడే వచ్చాను.''

''ఇంటికి వచ్చేస్తారా ?''

''ఆఁ ! ఎందుకు రాను !'' నా గొంతులో నుండి మాట పెగలడం లేదు.

ఇంతలో చినవాల్తేరు నుండి వస్తోన్న ఇరవైఆరో నెంబరు బస్సు చిందులేసుకుంటూ మా ముందుకొచ్చి ఆగింది.

బస్సు వచ్చీరావడంతో జనాలు జోరీగల్లా 'గీ' పెడుతూ బెల్లాన్ని చూసిన చీమల్లా బస్సులోకి ఎగ్రబాకారు.

ఆ అమ్మాయి కూడా బస్సు ఎక్కడానికి ఉపక్రమిస్తూ నా వైపు చూసి — ''మీరు రారా ?'' తీయగా పెదవి విరిచి నవ్వుతూ అంది.

నా గొంతు ఎండిపోయింది. క్షణం .. ఒక్కక్షణం స్థబ్దగా ఉండిపోయాను.

''వచ్చేస్తాను ! ... వచ్చేస్తాను ... '' అయోమయంగా అన్నాను.

''రండి ... మళ్ళా ఫస్టు షో వదిలే టైం కావస్తోంది. మరికసలు మనం ఇల్లు చేరుకో లేం !'' చేయిపట్టుకు లాగుతున్నట్లున్నాయా మాటలు.

రామలక్ష్మి రమ్మనిపిలిచే సరికి నాకు మతి పోయింది.

మరిక ఏదైతే అది అయిందని బస్సెక్కే సాను.

జనంతో కిట — కిట లాడులోంది బస్సు.

మనసులో ముక్కోటి దేవతల్నీ తలచు కున్నాను.

'దేవుడా !

ఈ బస్సు సింహాచలం చేరుకున్నేవరకూ ఏ టికెట్ కలక్టర్ రానివ్వకుండా కాపాడు !' మనసు లోనే వేనోళ్ళ ప్రార్థించాను.

ఎవడైనా టి. సీ వచ్చి టిక్కెట్టు అడుగు తాడనే భయంతో బిర్రబిగుసుకు పోయాను.

అయినా—నాలాంటి నీతి గిలవాడెవడో ఇలా టిక్కెట్టు తీయక భయపడతాడు గాని — ఎంత మంది దర్జాగా — దొరబాబుల్లా తిరగటంలేదు. ఫుట్‌బోర్డు మీద నిలబడటం — స్టాప్ వచ్చేసరికి దిగి జారుకోవటం.

ఒకవేళ కండక్టరు తప్పి జారీ టిక్కెట్టు అడిగితే 'పాసని' ఫోర్సుగా చెప్పడం— !

జనంతో కిక్కిరిసిన బండిలో కండక్టరు టిక్కెట్లే కొడతాడా ? పాసులే చెక్‌చేస్తాడా ?

నాలో కొంచెం ధైర్యం రాజుకుంది.

ఆడాళ్ళమధ్య నుండి విరాభిమన్యుడిలా చీల్చుకుంటూ నా ముందు నుండి మగాళ్ళను నెట్టుకుంటూ వెనుక డోర్ వైపు 'టిక్కెట్... టిక్కెట్' అని అరచుకుంటూ వెళ్ళాడు కండక్టరు.

కండక్టర్ నా ముందు కొచ్చేసరికి నాకు ముచ్చెమటలు పోసాయి. నోటమాట రాలేదు. రాతిబొమ్మలా దిక్కులు చూస్తూ నిలబడి పోయాను.

ఒకవేళ తన్ని కండక్టరు టిక్కెట్టు అడిగితేనో ? తీసానని చెప్తే—? ఏదని--చూపమని అడుగుతాడేమో ? పాసని చెబితే చూపించమం టేమో ! వెనుక ఎవరైనా తీస్తారని చెప్పి తప్పించుకుంటే — గోపాలపట్నం వచ్చాకయినా దొరికిపోతాడు. ఆసరికి జనాలంతా దిగిపోయి బస్సంతా ఖాళీగా ఉంటుంది. అబద్ధం ఆడినందుకు నానా దుర్భాషలూ ఆడుతాడు.

అప్పుడు —

రామలక్ష్మి... రామలక్ష్మి... రామ ! రామ ! అంటూ నోరు నొక్కుకుంటుంది. కళ్ళతోనే 'ఛీ' కొడుతుంది.

# భారతి

సాహిత్య మాసపత్రిక

తెనుగువారి సంస్కృతికి ప్రతిబింబం

విడి పత్రిక : రూ. 4/-


## దొంగలు

నా అదృష్టం బాగుండి కండక్టర్ నావైపైనా చూడకుండా వెళ్లిపోయాడు.

మరిక గోపాలపట్నం చేరేవరకూ బస్సు లోపలకు రాడు. ముందు గేటు దగ్గరా — వెనుక గేటు దగ్గరా ఎక్కేవాళ్ల దగ్గరే టిక్కెట్లు వసూలు చేసేస్తాడు.

నా మనసు కొంచెం కుదుటపడింది.

గుండెనిండా గాలి పీల్చుకొని నిలబడ్డాను.

అయిదు నిమిషాలయినా అయినట్టూ అనిపించలేదు నాకు. బస్సు గోపాలపట్నం చేరుకుంది.

కనీసం ఏభై నిమిషాలైనా ఉంటుంది వైజాగ్ నుండి గోపాలపట్నం రావడానికి. అటువంటిది ఇంత వేగంగా వచ్చేసిందేవిటి ?

వాచీ చూసుకున్నాను.

నిజమే ! తానప్పటికే బస్సెక్కి గంటయింది. అయిదు నిమిషాలు ఆలస్యమయింది. అయినా — తనకెందుకలా అనిపించింది.

బస్సు కాళీ అయిపోయింది.

ముందర సీట్లోకెళ్లి కూర్చున్నాను.

గోపాలపట్నంలో చాలామంది ఎక్కేరు. అంతా మా వూరివాళ్లే. బస్సుకు కూడా మా వూరే ఆఖరు స్టేజీ. సింహాచలం చేరుకున్న తర్వాతమళ్లా తిరిగి వైజాగ్ బయలుదేరుతాయి బస్సులన్నీ.

విశాఖకు మా వూరికి ఏభై సిటీబస్సులున్నాయి. ఉదయం నాలుగ్గంటలనుండీ రాత్రి పండ్రెండు గంటల వరకూ ఎడతెరిపిలేకుండా తిరుగుతూనే ఉంటాయి.

బస్సు డిపో కూడా ఉంది. బస్సులు ఆగాలన్నా — బయలుదేరాలన్నా మా వూరే కేంద్రం.

పెట్రోలు బంక్ దగ్గరకొచ్చేసరికి అందరి దగ్గరకూ వెళ్లి టిక్కెట్లు వసూలు చేసుకువచ్చాడు కండక్టరు.

నా దగ్గర కొచ్చేసరికి నాకు ఒళ్లు జలదరించింది.

తలబైటకు త్రిప్పి ఎటో చూస్తున్నట్టూ కూర్చుండిపోయాను. నా దృష్టి మాత్రం ఆయనమీదే ఉంది.

మరోసారి 'టిక్కెట్టు ... టిక్కెట్టు... అంటూ రొండు కొట్టాడు.

"నాయనలారా ! ఎవరైనా టిక్కెట్టు తీయనివాళ్లుంటే టిక్కెట్టు తీసుకోండి. ఎవరైనా వచ్చి చెక్‌చేస్తే మీకే ప్రమాదం"! గట్టిగా గొంతు చించుకొని అంటున్నాడు కండక్టరు.

నా పిడికెడు గుండెని ఎవరో పిసికేసినట్లనిపించింది.

మౌనంగా కూర్చుండిపోయాను.

ఆ క్షణం — నా అంతరాత్మ అనుభవించిన క్షోభ అంతా — ఇంతా కాదు. ఆ క్షణం ఊహించలేనిది. ఆ ఘడియ వర్ణించలేనిది.

"గురూ ! కొంచెం జరుగ్గురూ !" ఎవరో నన్నే భుజం తట్టి పిలిచేసరికి ఉలిక్కిపడ్డాను తలఎత్తి తేర — పారా చూసాను,

కండక్టర్ !

కంఠాన్ని ఎవరో పిండేసినట్లయింది.

ఏం చెప్పాలో — ఏం చేయాలో — అసలా క్షణం నేనేవిటో తెలీకుండా శిలలా ఉండిపోయాను.

"కొంచెం జరుగ్గురూ!" అని నా ప్రక్కన సర్దుకు కూర్చుంటూ అన్నాడా కండక్టర్.

జరిగి కూర్చున్నాను. కొంచెం మనసు తేలిక పడింది. కండక్టర్ వలన భయంలేదు.

కానీ, దిగేటప్పుడు ఏ టీ.సీ. అయినా చెక్ చేస్తేనో ?!

ఆ భయం ఇంకా బిగించేస్తోంది నన్ను

కండక్టర్‌వైపు ఓసారి కళ్లెత్తి చూసాను అతనూ నావైపు చూసి డబ్బులు లెక్కపెడుతున్నవాడల్లా నాకో ఇరవై రూపాయలనోటు అందిస్తూ ఇలా అన్నాడు —

"గురూ! ఈ ఇరవయ్యీ నీ దగ్గరఉంచు. కొంపదీసి స్క్వాడ్ వచ్చిందంటే పిట్టలా దొరికిపోతాను. స్టేండులో దిగాక ఎవరూ రాకపోతే ఇచ్చేద్దువుగాని."

నాకు ఆశ్చర్యం వేసింది.

ఈ ఒక్క ట్రిప్పులో - చిన వాల్తేరు నుండి ఇక్కడకు వచ్చేలోపులో ఇరవై రూపాయలు సంపాదించాడా ?

మరిక ఆలోచించలేకపోయాను. ఇరవై రూపాయలనోటు జేబులో పెట్టాను.

డబ్బులు లెక్కపెట్టి బేగ్‌లో పెట్టుకొని నావైపు నవ్వుతూ చూసాడు కండక్టరు.

"నా దగ్గర ఏభైనోటుంది. చిల్లర లేదు. ఓ ఏభైపైసల టిక్కెట్టు ఇస్తావేంటి గురూ!" తెలివిగా అదే అదనని అడిగాను.

"దానికేముంది గురూ! ఇదిగో! ఎవరైనా అడిగితే గోపాలపట్నంలో ఎక్కేనని చెప్పు !"

టికెట్టు నా చేతిలోపెట్టి నిలబడ్డాడు.

బస్సు ముందుకు విమానంలా దూసుకుపోతోంది.

కండక్టరు మరోసారి టిక్కెట్టు.. టిక్కెట్టు... అంటూ ఓసారి బస్సంతా తిరిగేసి మళ్లా ఇందాకటిలాగే 'టిక్కెట్టులేని ప్రయాణం నేరం' అని గట్టిగా అరచి చెప్తున్నాడు.

నేను దర్జాగా సీటుకు జారగిలబడి కాలు మీద కాలు వేసుకొని కూర్చున్నాను. ★